నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com


శనివారం
1 ఫిబ్రవరి
2025
పేజీలు 8

గుంటూరు
పల్నాడు

రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి పెరిగిన భూముల రిజిస్ట్రేషన్ విలువలు అమలులోకి రానున్నాయి. అయితే అమరావతి రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ఫీజు పెంచడం లేదని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇప్పటికే స్పష్టం చేశారు. దీంతో గత రెండు రోజుల నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు రైతులు, కొనుగోలు దారులతో కిటకిట లాడుతున్నాయి. ప్రభుత్వానికి రూ. కోట్లలో పెద్ద ఎత్తున ఆదాయం దక్కింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు అన్ని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అయితే కొన్నిచోట్ల సర్వర్లు మొరాయించటం తో ఒక్కొక్క డాక్యుమెంట్ రిజిస్టర్ చేయాలంటే గంటకు పైగా సమయం పడుతోందని సబ్ రిజిస్టర్లు, కొనుగోలు, అమ్మకం దారులు చెబుతున్నారు, ప్లాట్లు, ఇళ్ల స్థలాలు, పొలాలు, భవనాలు, అపార్ట్మెంట్, వీలునామా రిజిస్ట్రేషన్లు, పార్టిషన్, హక్కు విడుదల, రిజిస్ట్రేషన్ లో ఈసారి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున జరిగాయి. ఏరియా, భూముల పరిస్థితిని బట్టి, ప్రాంతాన్ని బట్టి 10 నుంచి 20 శాతం మేరకు భూముల ధరలను ప్రభుత్వం పెంచింది. భూముల ధర పెరిగితే రిజిస్ట్రేషన్ చార్జీల రూపేనా ప్రభుత్వానికి ఆదాయం భారీగా దక్కుతుంది. ఒక్కొక్క ఏరియాను బట్టి ఆయా ప్రాంతాల్లో ఉన్న సబ్. రిజిస్ట్రార్లు రూపొందించిన ధరలు ఆధారంగా పెంపుకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది...

– గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో





# నేటి నుంచి రిజిస్ట్రేషన్ విలువ పెంపు



రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి కొత్త మార్కెట్ విలువలు నేటి నుంచి అమల్లోకి రాబోతున్నాయి. ఆయా ప్రాంతాల అభివృద్ధి ప్రతిపాదికన 10 శాతం నుంచి 20 శాతం వరకు ఇవి పెరిగాయి. కొన్నిచోట్ల పెంపు కాస్త ఎక్కువగానే ఉంది. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా పెంచిన వాటిని కొన్నిచోట్ల తగ్గించారు. కొత్త మార్కెట్ విలువల అమలుకు ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను ఆదేశించింది. దీనివల్ల ఈ ఏడాది ప్రభుత్వానికి ఆదాయం కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. తొలుత జనవరి నుంచి భూముల రేట్లు పెంచాలని ప్రభుత్వం భావించినా ఆ తర్వాత ఉన్నతాధికారులు భారీగా కసరత్తు చేసి భూముల విలువలను నేటి నుంచి పెంచుతున్నారు. భూములతోపాటు నిర్మాణాల విలువల పెంపు కూడా ఫిబ్రవరి 1 నుంచే అమల్లోకి రానుంది. ఇందుకు సంబంధించిన వివరాలనూ రిజిస్ట్రేషన్ల శాఖ సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపింది. భూముల విలువ పెద్ద ఎత్తున పెరుగుతుందని తెలియడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొనుగోలుదారులు, అమ్మకం దారులతో గత నాలుగు రోజుల నుంచి కిటకిట లాడిపోతున్నాయి గుంటూరు నగరంలో ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు, నల్లపాడు, మంగళగిరి, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల, వినుకొండ పాటు జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో శుక్రవారం మిగతా 3వ పేజీలో

- కిటకిటలాడుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు
- కొన్నిచోట్ల మొరాయించిన సర్వర్లు
- నిర్మాణ విలువలు కూడా పెంపు
- అర్ధరాత్రి వరకు రిజిస్ట్రేషన్లు
- రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో పెంపు లేదు
- భారీ ఎత్తున ప్రభుత్వానికి ఆదాయం











## సమాజాన్ని మేల్కొలుపుతున్న "నేటి దినపత్రిక సూర్య"


తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తూ. సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని అక్షరాలను చక్కటి వార్తల రూపంలో రూపు దిద్ది నిరంతరం పాఠకులను తెల్లవారుఝామునే మేల్కొల్పుతున్న " నేటి దినపత్రిక సూర్య నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, పిడుగురాళ్ల పట్టణ తహసిల్దార్ జె. మధు బాబు, పిడుగురాళ్ల పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు , పిడుగురాళ్ల పట్టణ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సి ఐ . కసుకుర్తి కర్ణ , పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఇంజనీర్ తదితరులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న నేటి దినపత్రిక సూర్య యాజమాన్యాన్ని, పాత్రికేయ బృందాన్ని ఆవిష్కరణ కర్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో నేటి దినపత్రిక సూర్య గురజాల ప్రతినిధి ఏసుబాబు, మాచవరం రిపోర్టర్ ఎం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వినుకొండలో సబ్ రిజిస్ట్రార్ కరిముల్లా ఖాన్ " నేటి దినపత్రిక సూర్య "2025 నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ ఆర్సి ఇన్చార్జి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

– గురజాల / వినుకొండ నేటి దినపత్రిక సూర్య ప్రతినిధి



## రూ.15 లక్షల నగదుతో ఉడాయించిన దొంగనోట్ల ముఠా

▸ కాజా టోల్ గేట్ వద్ద ర్యాప్ వేసిన దుండగులు
▸ పోలీసుల అదుపులో నిందితులు?




**మంగళగిరి, మేజర్ న్యూస్:** రూపాయికి రెండు రూపాయిలు చొప్పున చెలామణి నగదు ఇస్తామని నమ్మించి రూ.15లక్షల నగదుతో ఓ దొంగనోట్ల ముఠా ఉడాయించిన ఘటన మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి కాజ టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు... చిత్తూరుకు చెందిన పగడాల జ్యోతి, వెంకటాచలం, విశ్వనాథ్ లు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో వీరికి గత కొన్ని రోజుల క్రితం వసుంధర అనే మహిళ పరిచయమైంది. తనకు తెలిసిన వారు దొంగనోట్లు చెలామణి చేస్తుంటారని, రూపాయికి రెండు రూపాయిల చొప్పున చెలామణి నగదు ఇస్తారని నమ్మబలికింది. నిజమేనని నమ్మిన జ్యోతి, వెంకటాచలం, విశ్వనాథ్ లు గురువారం రాత్రి రూ. 15లక్షల నగదుతో చిత్తూరు నుంచి బయలుదేరి కాజ టోల్ ప్లాజా వద్దకు చేరుకున్నారు. అప్పటికే పేరేచర్ల కు చెందిన ఖాదర్ వలి, నాగూర్ వలి అనే ఇద్దరు దొంగనోట్ల ముఠా సభ్యులు చేరుకున్నారు. జ్యోతి, వెంకటాచలం, విశ్వనాథ్ లు తమ వెంట తీసుకువచ్చిన రూ.15లక్షల నగదును ఖాదర్ వలి, నాగూర్ వలి లు తీసుకుని వారికి రూ.30లక్షల చెలామణి నగదు అంటూ నోట్ల కట్టలు ఇచ్చారు. అదే క్రమంలో పోలీసులు వస్తున్నారంటూ ఖాదర్ వలి, నాగూర్ వలి లు బిగ్గరగా కేకలు వేసి అక్కడి నుంచి పారిపోయారు. తమకు ఇచ్చిన నోట్లపై అనుమానం వచ్చిన జ్యోతి, వెంకటాచలం, విశ్వనాథ్ లు పరిశీలించగా నోట్ల కట్టల మధ్యలో నోట్ల సైజులో కట్ చేసిన తెల్ల పేపర్లు ఉన్నాయి. దీంతో ఖంగుతిన్న బాధితులు తాము మోసపోయామని గ్రహించి మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అక్రమ సంపాదన కోసం అత్యాశకు పోయి మోసపోవద్దని, ప్రజలు ఇటువంటి వ్యవహారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణ – గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి ఫిబ్రవరి 27 న జరిగే ఎన్నికలకు సంబంధించి స్థానిక ఏ.సి కళాశాలలో బ్యాలెట్ బాక్సులు భద్రపర్చే గదులు , రిసెప్షన్ సెంటర్లు , డిస్ట్రిబ్యూషన్ సెంటర్ , కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎస్. నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ తో కలసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల నుండి ఏ.సి కళాశాలకు వచ్చే వాహనాలు , తిరిగి వెళ్ళే వాహనాలతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు. రిసెప్షన్ కౌంటర్ల వద్ద బ్యాలెట్ బాక్సుల స్వీకరణ , వాటిని సంబంధిత గదులకు తరలించే మార్గాల్లో బారీకేటింగ్ ఏర్పాట్లు పకడ్బంధీగా చేపట్టాలని , సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని, పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి షేక్. ఖాజావలి, ఆర్డిఓ కె. శ్రీనివాస రావు , జీయంసీ అదనపు కమిషనర్ ఓబులేశు , గుంటూరు తూర్పు మండల తహశీల్దార్ నగేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి ఆర్యవైశ్యులు కృతజ్ఞతలు



**మాచవరం మేజర్ న్యూస్ :** రాష్ట్ర కూటమి ప్రభుత్వం మన కులదైవం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం జరపటం ఎంతో విశేషమని పిడుగురాళ్ల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వంకాయల రమేష్ అన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు జై వాసవి జై జై వాసవి ఈ సందర్భంగా మాచవరం కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు.

## పెదకాకానిలో గోడపత్రికలు ఆవిష్కరణ

**పెదకాకాని మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెదకాకానిలో దరగిరి గానుగ సెంటర్ అంబేద్కర్ ఓపెన్ థియేటర్ వద్ద శనివారం వైసిపి పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఫీజు పోరు పోస్టర్లు ఆవిష్కరించిన ఉన్నట్లు తెలిపారు. మండలంలోని జడ్పిటిసి జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ అనుబంధ విభాగాలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని తెలిపారు

## ప్రతి శనివారం “నో బ్యాగ్ డే”

**బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హనుమంతరావు**



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు, వారి భవిష్యత్తుకు, బంగారు బాటలు వేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా ప్రతి శనివారం “నో బ్యాగ్ డే”ను అమల్లోకి తీసుకురావడం జరిగినది. విద్యార్థులకు కరికులతో పాటు కో కరికుల కార్యకలాపాలను నిర్వహణ ద్వారా వారి యొక్క మానసిక, శారీరక ఎదుగుదల దృఢంగా ఉంటుంది. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించేందుకు “నో బ్యాక్ డే” దోహదపడుతుందని తెలియజేశారు.

## వాసవి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన : ఎమ్మెల్యే శ్రీనివాసరావు





**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** పట్టణంలోని జానపాడు రోడ్డు శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈరోజు జరిగిన అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు స్వాగతం పలికిన ఆలయ కమిటీ వారు, ఆర్యవైశ్య పట్టణ ప్రముఖులు. అమ్మవారికి అధికారికంగా పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే యరపతినేని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారకంగా ప్రకటించి గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఆర్యవైశ్యల సోదరుల కుటుంబ ఇష్ట దైవం ఆశీస్సులు మన మనందరి కి ఉండాలని, ఒక విశిష్టమైన రోజుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందంటే, ఆర్యవైశ్యుల వర్గాల వల్ల, చంద్రబాబు ప్రభుత్వానికి, ఎన్డీఏ ప్రభుత్వానికి ఎటువంటి చిత్తశుద్ధి ఉందో గౌరవం ఉందో మీ అందరికీ తెలియజేస్తున్నాను అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గాని, తరువాత గాని ఎంతమంది ముఖ్యమంత్రులు వచ్చినా ఇటువంటి నిర్ణయం చేయలేదన్నారు. ఈరోజు ఈ నిర్ణయం చేయటానికి మనకు ఇచ్చిన గౌరవం, గుర్తింపుగా భావించాలి, మనందరం కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేయాలన్నారు.

## పదోన్నతి పొందిన అధికారులకు ఘన సన్మానం





**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** పట్టణ మున్సిపల్ కమిషనర్ గా చేస్తున్న కొలిమి షమ్మీ గ్రేడ్ 3 నుండి గ్రేడ్ 2 స్థాయిగా, టీపీఎస్ గా పనిచేస్తున్న రిజ్వాన తీపి ఓ గా పదోన్నతి పొందారు. వీరిద్దరికి శుక్రవారం మున్సిపల్ సమావేశం మందిరంలో సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. షమ్మీ పదోన్నతి పొంది ఇక్కడే విధులు నిర్వహిస్తూ ఉండగా రిజ్వాన టిపిఎస్ నుండి టీపీఓగా పదోన్నతి పొందుతూ ఉత్తర్వులు అందాయి. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ టీపీఓగా పదోన్నతితో కూడిన బదిలీపై వెళ్ళనున్నారు. పట్టణంలోని 15 సచివాలయాల సెక్రటరీలు, అన్ని శాఖల అధికారులు, మున్సిపల్ ఉద్యోగు లందరూ కలిసి పదోన్నతి పొందిన సందర్భంగా ఇద్దరికీ, పూలమాలలతో, భోకేలతో అభినందనలు తెలిపి, శాలువాలతో ఘన సత్కారం నిర్వహించారు.

## ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్య డిగ్రీ పరీక్షలను పాత విధానంలోనే నిర్వహించాలి

**ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి**



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ఎస్వీ యూనివర్సిటీ దూర విద్యా విభాగం లో డిగ్రీ పరీక్షలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళగిరిలోని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి రాధాకృష్ణమూర్తి కి ఏఐఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి వల్ల రాజు, బందెల నాసర్ జి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్, గుంటూరు జిల్లా కార్యదర్శి యశ్వంత్, సహాయ కార్యదర్శి అమర్నాథ్ లు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పిన యూనివర్సిటీ అధికారులు ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాత పద్ధతిలోనే పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# మోడల్ అధికారులు ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి



గుంటూరు, మేజర్ న్యూస్ : ఎన్నికల కమిషన్ ఎంఎల్సి ఎన్నికల నిర్వహణపై రూపొందించిన నిబంధనావళి పుస్తకాన్ని క్షుణ్ణంగా ఆకాళింపు చేసుకుని నోడల్ అధికారులు ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సూచించారు. గురువారం సాయంత్రం కలక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో ఉమ్మడి కృష్ణ – గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ , తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ లతో కలసి నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ ఎం ఎల్ సీ ఎన్నికల నిర్వహణకు గాను ఏర్పాటు చేసిన మ్యాన్ మేనేజ్మెంట్, ట్రాన్స్ పోర్ట్ మేనేజ్మెంట్, ట్రైనింగ్ మేనేజ్ మెంట్, మెటీరియల్ మరియు బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, కంప్లయింట్ల పరిష్కారం, లా అండ్ ఆర్డర్, పోస్టల్ బ్యాలెట్ల ముద్రణ, మీడియా కమ్యూనికేషన్, స్వీప్ కమ్యూనికేషన్ ప్లాన్, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఎలక్టోరల్ రోల్స్ మరియు మార్క్ కాపీల తయారీ, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ మరియు కౌంటింగ్ సెంటర్ల మేనేజ్ మెంట్ల పై ఏర్పాటు చేసిన నోడల్ అధికారులు ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా చదివి, ఆ మేరకు ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. తదుపరి సమావేశంలో ప్రతి నోడల్ అధికారితో వారికి కేటాయించిన విధులపై వారికి వున్న అవగాహనను సమీక్షించడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ సూచించారు. స్వీప్ యాక్టివిటి ద్వారా ఓటు వేసే విధానంపై విస్తృతంగా సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో నోడల్ అధికారులు డిఆర్ఓ షేక్.ఖజావలి, సిపిఓ శేషశ్రీ, డీటీసీ కె. సీతారామిరెడ్డి, జెడ్ పీ సిఇఓ జ్యోతిబసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు ఓబులేశు, ఆర్డీవో కె.శ్రీనివాస రావు, బిమల్ కుమార్, పీడీలు హౌసింగ్, డ్వామా, డీఆర్డీఏ ప్రసాద్, బి.శంకర్, విజయలక్ష్మీ, జిల్లా ఉపాధి అధికారిణి దుర్గాబాయి, డిఎస్ఓ కోమలి పద్మ, డిపిఓ కె. నాగసాయి కుమార్, సమాచార శాఖ ఉప సంచాల కులు అబ్దుల్ రఫీక్తదితర అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖపై ద్వారకా తిరుమలరావు చెరగని ముద్ర : డీజీపీ హరీష్ కుమార్ గుప్తా



మంగళగిరి, మేజర్ న్యూస్ : పోలీస్ శాఖ పై మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు చెరగని ముద్ర వేశారని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కొనియాడారు. శుక్రవారం నగరంలోని ఆరవ ఏపీఎస్పీ బెటాలియన్ లో మాజీ డీజీపీ ద్వారక తిరుమల రావు పదవి విరమణ సందర్భంగా ఫేర్ వెల్ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ... ప్రజల భద్రత కోసం ద్వారకా తిరుమలరావు అనేక సంస్కరణలు చేపట్టాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని యువతను దృష్టిలో పెట్టుకొని మత్తు పదార్థాల నియంత్రణ కోసం ఈగల్ టీమ్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్ర డీజీపీగా తన శక్తి మేర పనిచేస్తానని, వ్యక్తుల స్వేచ్ఛకు భంగం వాటిల్లేలా ఎవరైనా సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ... తన జీవితంలో ప్రత్యేకమైన ఉద్వేగ భరిత క్షణాలు అని, ఇకపై తన ఒంటిపై యూనిఫామ్ ఉండదంటేనే ఏదోలా ఉందన్నారు. తాను సర్వీసులో చేరిన నాటి నుంచి అనేక సవాళ్లను స్వీకరించానని, అందుకు తగినట్లే పనిచేశానన్నారు. యావత్తు పోలీస్ శాఖ సంప్రదాయ పోలీసింగ్ నుంచి సాంకేతిక పోలీసింగ్ వైపు మారిందన్నారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల సమయంలోనూ పోలీసులు అత్యంత సాహసోపేతంగా పనిచేశారని కితాబిచ్చారు. ప్రభుత్వ సహకారం వల్లనే పోలీసు వ్యవస్థను బలోపేతం చేశానని తెలిపారు. గంజాయి చిన్నారులపై నేరాలు సైబర్ క్రైమ్ విషయంలో చర్యలు చేపట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆరవ బెటాలియన్ ఐజిపి రాజకుమారి, పలువురు ఎస్పీలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### అభినందనలు తెలిపిన మన్నవ



గుంటూరు, మేజర్ న్యూస్ : ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇటీవల మొదటిసారి అమెరికా వెళ్లిన సందర్భంగా పలువురు స్నేహితులు, అభిమానులు మన్నవ మోహన కృష్ణను ఘనంగా అభినందించారు. అనేకమంది మిత్రులు న్యూజెర్సీలో ఏర్పాటు చేసిన నా ఆత్మీయ సమావేశానికి అమెరికాలోని అనేక చోట్ల నుంచి వేలాదిగా తరలి వచ్చి మన్నవను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆత్మీయులకు, శ్రేయోభిలాషులకు ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక ధన్యవాదాలు. తెలిపారు అలాగే తనపై ఉన్న అభిమానంతో భారీగా ఈ ఆత్మీయ సమావేశాన్ని అమెరికాలో నిర్వహించిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఏటుకూరు వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి

**మరో ముగ్గురికి తీవ్ర గాయాలు**

గుంటూరు క్రైమ్, మేజర్ న్యూస్ : గుంటూరు నగర శివారులోని ఏటుకూరు–ప్రత్తిపాడు రోడ్డుపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ఘోర ప్రమాదం సంభవించి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన స్థానికులను కలచివేసింది. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు చెబుతున్నారు. వీరు పట్టి చెరుకూరు మండలం కుర్నూతల, బయ్యారం గ్రామాలకు చెందిన వ్యక్తులుగా భావిస్తున్నారు. పూర్తి వివరాలు అందాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే నల్లపాడు సిఐ వంశీధర్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.





## నేటి నుంచి రిజిస్ట్రేషన్ విలువ పెంపు

(మొదటి పేజీ తరువాయి)

అర్ధరాత్రి వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న నిర్మాణాల విలువలపై సగటున 6 శాతం వరకు పెంపు ఉంది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ద్వారా శాస్త్రీయ విధానంలో అధ్యయనం చేయించింది.

**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కిటకిట**

రిజిస్ట్రేషన్ విలువల పెంపును దృష్టిలో పెట్టుకొని.. క్రయ, విక్రయదారులతో శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ కనిపించింది. , గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలతో పాటు, ఇతర నగరాల్లో ఈ పరిస్థితి నెలకొంది. రోజూ సగటున 40 రిజిస్ట్రేషన్లు ఉండే కార్యాలయాల్లో శుక్రవారం 100 నుంచి 150 డాక్యుమెంట్ చొప్పున రిజిస్టర్ అయినట్లు తెలుస్తోంది. ఏకకాలంలో దస్తావేజులు పెరిగిపోవడంతో సర్వర్పై ఒత్తిడి పెరిగింది. దీనివల్ల రిజిస్ట్రేషన్ల నిర్వహణకు అధిక సమయం పట్టింది. చలానాల చెల్లింపులకూ నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో క్రయ, విక్రయదారులు అవస్థలు పడ్డారు. సాయంత్రం నుంచి క్రమంగా సర్వర్పై ఒత్తిడి తగ్గడంతో రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయి. కొన్ని కార్యాలయాల్లో రాత్రి పొద్దుపోయే వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగాయి.

**నిర్మాణాల విలువలు సైతం..**

నగర, పురపాలక సంఘాలు, నగర పంచాయతీ, పంచాయతీల్లో. కూడా నిర్మాణాలపై పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ ఫీజులు పెరిగాయి. దీనివల్ల ప్రభుత్వానికి కూడా పెద్ద ఎత్తున ఆదాయం వచ్చే అవకాశం ఉంది. నివాస భవనాల విభాగంలో.. అపార్టుమెంట్ ఫ్లాట్ (గ్రౌండ్,ఫస్ట్,సెకండ్ ఫ్లోర్)కు రూ.1,490, రూ.1,270, రూ.900 (చదరపు అడుగుకు) చొప్పున ఖరారు చేశారు. ఇదేవిధంగా మూడో అంతస్తు ఆపైన వాటికి అదనంగా రూ.30, రూ.25, రూ.20గా నిర్ణయించారు.

**వాణిజ్య భవనాల విభాగంలో..**

గ్రౌండ్ ఫ్లోర్కు రూ.1,800, రూ.1,540, రూ.1,060 (చదరపు అడుగుకు) చొప్పున నిర్ణయించారు. మొదటి అంతస్తుకు రూ.1,700 రూ.1,480, రూ.1,010, రెండో అంతస్తు, ఆ పైన ప్రతి ఫ్లోర్కు రూ.1,590, రూ.1,380 రూ.950 చొప్పున చెల్లించాలి. సినిమా హాళ్లు, కర్మాగారాలకు చదరపు అడుగుకు రూ.950 రూ.880 రూ.690 చొప్పున ఖరారు చేశారు. పెంకుటిల్లు, రేకుల షెడ్లు, ఇతర వాటికి రూ.740, రూ.580 రూ.420, చవిటి మిద్దెలకు రూ.420, రూ.320, రూ.240 చొప్పున (చదరపు అడుగుకు) ఖరారు చేశారు. వీటితోపాటు మరికొన్ని నిర్మాణాల విలువలు కూడా బాగా పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా భూములు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలు పెరిగినందున కొద్ది నెలల పాటు రిజిస్ట్రేషన్లు మందకొండిగా సాగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.


**మొరాయించిన సర్వర్లు..**

ఏపీలో రిజిస్ట్రేషన్ సర్వర్లు గత రెండు రోజుల నుంచి మొరాయించాయి. రెండు రోజులుగా ఓపెన్ కాలేదని వినియోగదారులు చెబుతున్నారు. ఫిబ్రవరి 1నుంచి కొత్త మార్కెట్ ధరలు అమలు కానుండటంతో రిజిస్ట్రార్ కార్యాలయాలకు జనం తాకిడి పెరిగింది. దీంతో సీఎఫ్ఎంఎస్ సర్వర్ ఓపెన్ కావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. అయితే నేడు ఒక్కరోజే సమయం ఉండటంతో ఇదే పరిస్థితి ఉంటుందని రిజిస్ట్రేషన్ అధికారులు చెబుతున్నారు.

**రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో..**

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1 నుంచి భూముల మార్కెట్ ధరలు పెంచుతున్నట్లు తెలిపింది. అయితే మంగళవారం, బుధవారాల్లో అమావాస్య రావడంతో రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పోటెత్తారు. ఇంతకుముందు మంత్రి అనగాని సత్యప్రసాద్ గ్రోత్ కారిడార్లలో రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతున్నట్లు చెప్పారు. కొన్ని చోట్ల ధరలు తగ్గితే, మరికొన్ని చోట్ల పెరగనున్నట్లు వెల్లడించారు. రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెంచకూడదని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఇప్పటికే స్పష్టం చేశారు.

## టిప్పర్ లారీ ఢీకొని యాచకుడి మృతి



మంగళగిరి, మేజర్ న్యూస్ : గుర్తు తెలియని టిప్పర్ లారీ ఢీకొని ఓ యాచకుడు (25) మృతి చెందాడు. సేకరించిన వివరాల మేరకు మంగళగిరి –తాడేపల్లి కార్పోరేషన్ పరిధి చినకాకాని వై జంక్షన్ నేతన్న సర్కిల్ వద్ద ఓ గుర్తు తెలియని యాచకుడు శుక్రవారం రాత్రి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో గుంటూరు వైపు నుంచి మంగళగిరి వైపు వస్తున్న ఓ గుర్తు తెలియని టిప్పర్ లారీ యాచకుడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో యాచకుడి తల ఛిద్రమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని యాచకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం

**▸▸గుర్తు పట్టిన వారు కొత్తపేట పోలీసులు సంప్రదించండి**



గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్: కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృత దేహం కనుగొన్నట్లు కొత్తపేట పోలీసులు విలేఖర్లకు శుక్రవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత స్వర్ణాంధ్ర హొటల్ పక్కన గల కాటన్ బజార్ రోడ్డు మార్గంలో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండటం గమనించిన స్థానికులు కొత్తపేట పోలీసులకు సమాచారం తెలియజేయడంతో కొత్తపేట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.కె సంశుద్దిన్ సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించి, మృతుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల వారిని విచారించి ఆచూకీ లభించకపోవడంతో మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. వైద్యాధికారులు ధ్రువీకరించిన మేరకు మృత దేహాన్ని మార్చురీలో ఉంచినట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు. సుమారు (35) సంవత్సరాలు కలిగిన ఊరు పేరు చిరునామా తెలియని మగ వ్యక్తి మరణించినట్లు గుర్తించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. మృత దేహము గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి నందు భద్రపరి చామని, సదరు మృతుడి ఆచూకీ గురించి సమాచారం తెలిసిన వెంటనే కొత్తపేట పోలీసు వారికి సమాచారం తెలిపి తీసుకువెళ్లవచ్చని కొత్తపేట పోలీసులు తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ ఫోన్ నెంబర్ : 8688831320 , 08632221815 నంబర్లకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# కోయంబత్తూరులో సాంకేతిక పద్ధతుల ద్వారా ప్రజలకు మెరుగైన త్రాగునీటి సరఫరా

## నగర కమిషనర్ పులి శ్రీనివాసులు






**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** కోయంబత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ లో అనుసరిస్తున్న త్రాగునీటి సరఫరా విధానం, అందుకు వినియోగిస్తున్న సాంకేతిక పద్ధతుల ద్వారా ప్రజలకు మెరుగైన త్రాగునీటి సరఫరా జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కోయంబత్తూర్ లో జరుగుతున్న రీజినల్ వర్క్ షాప్, క్షేత్ర స్థాయి పరిశీలనలో నగర కమిషనర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కోయంబత్తూర్ కార్పోరేషన్ లో శుక్రవారం జరిగిన వర్క్ షాప్ లో అమృత్ 2.0 డైరెక్టర్ ఇషా కాలియా ట్యాప్ నుండి త్రాగునీటిని తీసుకోవడంపై, అమృత్ అడిషనల్ సెక్రెటరి డి.తారా ప్రజలకు త్రాగునీటి సరఫరాపై అవగాహన కల్పించే విధానం గూర్చి వివరించారన్నారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ డిప్యూటీ అడ్వైజర్ డాక్టర్ రమాకాంత్ ట్యాప్ నుండి త్రాగునీటి సరఫరా అంశం గైడ్ లెన్స్ ని, కర్ణాటకలో 24/7 త్రాగునీటి సరఫరాపై డాక్టర్ కెపి జయరాం వివరించగా, కోయంబత్తూర్ లో దశలవారీగా త్రాగునీటి సరఫరాలో చేపట్టిన చర్యలను కమిషనర్ శివగురు ప్రభాకరన్ తెలిపారన్నారు. అనంతరం కోయంబత్తూరులోని ఏకెఎస్ నగర్ లో త్రాగునీటి పైప్ లైన్ పై లీకులను వినూత్నమైన విధానంలో వేగంగా గుర్తించడం, చరణ్ నగర్ లో ఆటోమేటిక్ గా త్రాగునీటి సరఫరా, సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్, కస్టమర్ రిలేషన్ మేనేజ్మెంట్ సెల్ లను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# కొర్నేపాటి మృతికి పలువురు సంతాపం



పెదకాకాని మేజర్ న్యూస్:- మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కొర్నెపాటి ఏడుకొండలు(86) మృతి చెందారు. రొంపిచర్ల మండలం గోగులపాడు గ్రామంలో మూడు ఎకరాలు కొని గోగులపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దానమి చ్చారు. అంతేకాకుండా 8,9,10 తరగ తుల అప్డేట్ అయ్యేవిధంగా అనుమతులు తీసుకొచ్చి చుట్టుపక్కల గ్రామాల పేద, మధ్యతరగతి బాల,బాలికలకు కనీసం 10 వ, తరగతి వరకు చదువుకొనుటకు పాటుపడ్డారు. మొదటగా తెలంగాణలో 10 సం.రాలు, తరువాత శ్రీకాకుళం జిల్లాలో 20 సం.రాలు, చివరగా 4 సం.రాలు రొంపిచర్లలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి అక్కడే పదవీ విరమణ పొందారు. వీరికి 5గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు కెవి.రమణారావు పాలిటెక్నిక్ కళాశాల(హెచ్ ఓ డి), రెండో కుమారుడు కె.వి శ్రీనివాసరావు సి ఐ డి ఎస్ పి, మూడవ కుమారుడు కె.వి మోహన్ రావు రైల్వే ఐజీ, డా. కుమార్తె కళ్యాణి వెటర్నరీ డాక్టర్, నాలుగో కుమారుడు కె.వి. హరిబాబు హొమియో వైద్యులు, కె.వి హేమంత్ నాగరాజు డి సి (ఎక్సైజ్ ), అల్లుడు డాక్టర్ వై. సాయి శేఖర్( ఎస్ ఐ బి) ఉన్నారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాల నరేంద్ర కుమార్ ఇంటెలిజెన్స్ డిపార్ట్మెంట్ పీహెచ్చీ రామకృష్ణ, రిటైర్డ్ ఎస్ పి ఎమ్.రవీంద్ర, అమరావతి జాయింట్ సెక్రటరీ ఉప్పుటూరి. మురళీకృష్ణ, జంగారెడ్డిగూడెం ఎస్పీ ఉప్పుటూరి. రవిచంద్ర, డిప్యూటీ ఎస్పీ రైల్వే గుంటూరు అక్కేశ్వరరావు, డిప్యూటీ ఎస్పిఐ విజయవాడ రత్నరాజు, డిప్యూటీ ఎస్పీ పోలీస్ అకాడమీ దేవదాసు, పలువురు సిఐలు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్లు, వెనిగండ్ల గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# జగన్ మళ్ళీ సీఎం కావడమే ఏకైక లక్ష్యం

**- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి**



**గుంటూరు, మేజర్ న్యూస్:** జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి కోరారు. మళ్ళీ వైయస్ జగన్ను ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులైన పి.బాలవెంకటరెడ్డి(బాలిరెడ్డి) శుక్ర వారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలిరెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ జెండా భుజాన మోస్తూ బాలిరెడ్డి తనతో కలిసి ప్రతి కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించినట్లు చెప్పారు. క్రియాశీలకంగా పని చేస్తారు కనుకనే ఆయనకు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా పార్టీలో సముచిత స్థానం దక్కినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో మరింత కీలకంగా వ్యవహరిస్తూ ఇటు పార్టీ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయ డంతో పాటు అటు పార్టీలో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలన్న ఆకాంక్షను ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పెద్దిరెడ్డి, కాసిరెడ్డి, ఉపేంద్రరెడ్డి, ఆనంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, లక్ష్మారెడ్డి, భాస్కర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో

# ఉచిత మెగా మెడికల్ క్యాంప్



**గుంటూరు, మేజర్ న్యూస్ :** లలిత సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్ గుంటూరు వారిచే న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ, అనస్తీషియా డాక్టర్ శాఖమూరి అనిల్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత క్రింద గురువారం 30.1.2025 న ఉచిత మెగా మెడికల్ క్యాంపును మేడికొండూరు మండలం పాలడుగు గ్రామం నందు నిర్వహించారు. ఈ క్యాంప్ ను 400 మందికి పైగా గ్రామస్తులు సద్వినియోగం చేసుకున్నారు అని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి రామశర్మ తెలిపారు. ఈ క్యాంపు నందు హార్ట్, బ్రైన్, క్యాన్సర్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, యురాలజీ, డెంటల్, గైనకాలజీ విభాగాల నందు నిర్వహించారు. ఈ క్యాంప్ లో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో భాగంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ పక్షవాత రిస్క్ ఫ్యాక్టర్స్, లక్షణాలు, నివారణా మార్గాలు గురించి విపులంగా వివరించారు. 50శాతం పక్షవాతాలు అధిక రక్తపోటు వలన కలుగుతున్నాయని , రక్తపోటును (బీపీ) సైలెంట్ కిల్లర్ అంటారని, కాబట్టి ప్రతి ఒక్కరూ బిపిని అదుపులో ఉంచుకోవాలని చెప్పారు. పివిడి కి గల కారణాలు ధూమపానం, హైబీపీ, షుగరు, శారీరకశ్రమ లేకపోవడం అధిక బరువు, అనారోగ్యకరపు ఆహారం మూలాన పివిడి వస్తుందని తెలిపారు. అలాగే దీని వల్ల వచ్చే కాంప్లికేషన్స్ కాళ్లు లేదా చేతివేళ్లు కోల్పోవడం తరచుగా ఇన్ఫెక్షన్ రావడం, కుళ్లి పోవడం వంటివి జరగవచ్చు అన్నారు. యురాలజిస్ట్ డాక్టర్ శరవన కుమార్ మాట్లాడుతూ లేజర్ చికిత్స ద్వారా కిడ్నీ లో రాళ్ళు ను తొలగించవచ్చు అని, అలాగే నీరు ఎక్కువగా తాగడం వలన కిడ్నీల్లో రాళ్ళు రాకుండా నివారించవచ్చు అని తెలిపారు.ఈ క్యాంప్ నందు ఉచితంగా బీపీ, షుగరు, ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్, కార్డియాలజీ కన్సల్టేషన్, న్యూరాలజీ కన్సల్టేషన్, అంకాలజిస్ట్ కన్సల్టేషన్, జనరల్ మెడిసిన్ కన్సల్టేషన్, జనరల్ సర్జరీ కన్సల్టేషన్, ఆర్థోపెడిక్ కాన్సల్టేషన్, యూరాలజీ కన్సల్టేషన్, గైనకాలజీ కన్సల్టేషన్, డెంటల్ కన్సల్టేషన్లు, డైటీషియన్ సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అయ్యప్ప శ్రీనివాస్, జనరల్ మెడిసిన్ డాక్టర్ రాజేష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఫణిరాజు, యూరాలజిస్ట్ డాక్టర్ శరవన్ కుమార్, ఆర్థోపెడిక్స్ డాక్టర్ వివేక్, డెంటల్ డాక్టర్ స్వాతి, గైనకాలజిస్ట్ డాక్టర్ చంద్రహాస్ జనరల్ సర్జన్ డాక్టర్ సాయి వెంకటేష్ ,డైటీషియన్ కావ్య, నర్సింగ్ స్టాఫ్, పారా మెడికల్ స్టాఫ్, హాస్పిటల్ సిబ్బంది, నర్సింగ్ కాలేజ్ స్టూడెంట్స్, మొదలగు వారు పాల్గొన్నారు.

## సాహిత్యం, కళలు, సంస్కృతులను ప్రోత్సహించాలి

### ఏఐపిఎల్ సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు




**గుంటూరు మేజర్ న్యూస్ :** కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, నిర్బంధ, అణచివేత రాజకీయ పాలనకు, సనాతనం పేరుతో హీన, బానిస భావ, పతన సంస్కృతిని ప్రోత్సహిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా భావ సారూప్య ప్రజాస్వామ్య శక్తులతో ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించడానికి సమయం ఆసన్నమైనదని ఆల్ ఇండియా పీపుల్స్ లిటరేచర్ అండ్ కల్చరల్ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు పేర్కొన్నారు.స్థానిక మెడికల్ కళాశాల ఎదురు ఎన్జీవో అసోసియేషన్ సమావేశ మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించే అఖిల భారత ప్రజాసాహిత్య, కళా సాంస్కృతిక సభలు ప్రారంభమయ్యాయి. వివిధ రాష్ట్రాల ప్రజా కళాకారులు డప్పుల, గజ్జల దరువుల దరువుతో స్వాగతించారు. ఏ ఐ పి ఎల్ సి ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిత్రకళ ప్రదర్శన ను ప్రముఖ చిత్రకారులు టి వెంకట్రావు ప్రారంభించారు. జాతీయ ఉపాధ్యక్షులు దివి కుమార్ సభకు స్వాగతం పలుకుగా ఏ ఐ పిఎల్ సిఎఫ్ నాయకులు రమణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. "పీపుల్స్ లిటరేచర్" 11 సంచికను ఆవిష్కరించి జాతీయ ప్రధాన కార్యదర్శి రవిబాబు కీలక ఉపన్యాసం చేస్తూ ఐదున్నర దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదం సాహిత్య కళా రంగాలలో కూడా ఆధిపత్యం సాధించి అభివృద్ధి చెందుతున్న ప్రగతిశీల, సాహిత్య, సాంస్కృతిక మరియు ప్రజా విప్లవ ఉద్యమాలపై తమ ప్రభావాన్ని చాటుకుంటున్నద న్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ముంచుకొస్తున్న ఆర్థిక, సామాజిక, సాహిత్య, కళా, సాంస్కృతిక దోపిడీలకు వ్యతిరేకంగా పీడిత ప్రజల గొంతుకగా అఖిల భారత ప్రజా సాహిత్య సాంస్కృతిక వేదిక బలమైన ప్రత్యామ్నాయ సంస్థగా కృషి చేస్తుందని వివరించారు. సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, సి ఎస్ ఆర్ ప్రసాద్, కాట్రగడ్డ దయానంద్, గౌతమ్ ముఖర్జీ, సుగధన్ పాల్ తదితరులు ప్రసంగించారు. ఆదివాసి నాయకులు రాంజీ గోల్డ్ జీవిత చరిత్ర పై ఆదివాసి చిన్నారులు ప్రదర్శించిన "బుడతల బుర్రకథ", శ్రీకాకుళోద్యమ గిరిజన పోరాట చరిత్రపై డాక్యుడ్రామా"పోరు దారి" ఆకట్టుకున్నాయి.

# ఆలపాటి గెలుపే కూటమి లక్ష్యం

### ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో బీజేపీ నేతల ఆత్మీయ సమావేశం



**గుంటూరు మేజర్ న్యూస్:** కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని బీజేపీ, జనసేన కూటమి బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గుంటూరు స్థానిక బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించగా గుంటూరు కృష్ణ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విచ్చేశారు. జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో ఏదైతే మూడు పార్టీలు బీజేపీ, టీడీపీ, జనసేన సమైక్యతతో కలిసి పనిచేసి కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామో అలాగే ఇప్పుడు కూడా ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్స్ లో మనందరం కలిసి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కి అఖండ మెజార్టీ తెచ్చే విధంగా వారి గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు.ఆలపాటి రాజేంద్రప్రసాద్ పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి కామెంట్స్ ఆలపాటి అనే నేను సుదీర్ఘ రాజకీయ అనుభవంతో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎప్పుడూ మీకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.జూపూడి రంగరాజు నేషనల్ కౌన్సిల్ మెంబర్ మాట్లాడుతూకూటమి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ విజయాన్ని అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణా గుంటూరు జిల్లాలో 33 అసెంబ్లీ నియోజకవర్గాలు,113 మండలాల్లో పట్టభద్రులు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించు కోవడానికి సిద్ధంగా ఉన్నారు.గతంలో కూటమిలో వుండి విపి సింగ్‌ను ప్రధానమంత్రిగా చేసిన ఘనత ఉందని గుర్తు చేశారు. రామాయణంలో ఉడతను కూడా రాముడు మరచి పోలేదు కాబట్టే రాముడు దేవుడు అయ్యాడన్నారు.రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను బీజేపీ కార్యకర్తలు దగ్గరుండి భారీ మెజారిటీతో గెలిపించి మరలా బీజేపీ కార్యాలయంలో మనమే సన్మానం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కొత్తూరి వెంకట సుబ్బారావు, ఈదర శ్రీనివాసరెడ్డి, భీమినేని చంద్రశేఖర్, గాజుల వెంకయ్యనాయుడు, కొక్కెర శ్రీనివాసయాదవ్, శనక్కాయల ఉమాశంకర్, నేరళ్ళ మాధవరావు, పాలపాటి రవికుమార్, చరక కుమార్ గౌడ్, వైవీ సుబ్బారావు, అసెంబ్లీ కన్వీనర్స్, మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

## జీఎంసీ లో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నాం

### నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు నగర పాలక సంస్థ,మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణ – గుంటూరు పట్ట భద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికకు సంబంధించి జనవరి 29వ తేదీ నుండే ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నా మని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎన్నికల నియామావళి అమలులో భాగంగా వార్డ్ సచివాలయాల వారీగా వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్లను పట్టణ ప్రణాళిక విభాగ ఆధ్వర్యంలోని దళం బృందాలు తొలగిస్తున్నా యన్నారు. అలాగే రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలను ముసుగులతో కప్పివేయడం జరుగు తుందని పేర్కొన్నారు. వార్డ్ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫోటోలు తొలగించాలని, నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నగరపాలక సంస్థ తరపున నూతన అభివృద్ధి పనులకు శంఖు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని అధికారులు తగు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. నగరంలో ఎన్నికల నియమావళి అమలుకు పట్టణ ప్రణాళిక అధికారులు భాధ్యత తీసుకోవాలని, విధుల్లో ఎక్కడా నిర్లిప్త వైఖరి ఉండదానికి వీలు లేదని స్పష్టం చేశారు.







## అభ్యసనం నిరంతర ప్రక్రియ



**గుంటూరు మేజర్ న్యూస్ :** అభ్యసనం నిరంతర ప్రక్రియగా ఉండాలని అని డాక్టర్ జి రామచంద్ర రావు అన్నారు. శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ చేతన చౌడవరంలోని వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యా లయ రిజిస్ట్రార్ డాక్టర్ జి రామచంద్ర రావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో కలసి గడిపిన వృదు బంధాలు నిలబడతాయని తెలిపారు. తదుపరి గౌరవ అతిథిగా విచ్చేసిన ఆర్ వి ఆర్,జె సి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలని వ్యక్తపరిచారు. బాలకుటీరు వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమంగా వినియోగించుకుంటూ, కాలాన్ని వృధా చేయకుండా ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవాలన్నారు. తదనంతరం సీఏవో దుర్గా రఘురామ్ మాట్లాడుతూ విద్యార్థుల భవితపై సోషల్ మీడియా చూపుతున్న ప్రభావాన్ని అర్థం చేసుకొని వారిని సరైన మార్గంలో నడపాలని తెలిపారు.ఈ కార్యక్రమానికి రావెల సాంబశివరావు గారు అధ్యక్షత వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో చేతన కార్యనిర్వాహకురాలు మరుద్వతి గారు, సహకార్యదర్శి జయశ్రీ గారు, ప్రిన్సిపల్స్ డాక్టర్ యం.డి. నస్రీన్, మల్లికార్జున రావు, వెంకటేశ్వర్లు, డీన్ లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.
ఇట్లు.. పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జ్, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777

# విద్యార్థుల కోసం ఉద్యమ బాట

- ఫిబ్రవరి 5న ఫీజు పోరు
- పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మేయర్ కావటి



**గుంటూరు మేజర్ న్యూస్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్ని చెల్లించకుండా.. కూటమి ప్రభుత్వం విద్యార్థులను చదువులకి దూరం చేస్తుందని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి ధ్వజమెత్తారు. దీనికి నిరసనగా విద్యార్థుల కోసం ఉద్యమబాట పడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి పోరు సలుపుతున్నట్లు ఆయన ప్రకటించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తలెట్టిన ఫీజు పోరుకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్‌ను గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైయస్సార్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, ఇతర విద్యార్థి నేతలు, పార్టీ ముఖ్యులతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ఆవిష్కరించారు. వైయస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిన్నాబత్తిన వినోద్ ఆధ్వర్యంలో శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం చేయడం వల్ల వారు చదువులు ఆపాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని పర్యవసానం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. పిల్లల ఫీజులకు అవసరమైనంత డబ్బులు లేక తల్లిదండ్రులు అప్పులు చేయడం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇది మంచి పరిణామం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 2018-19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం బకాయి పెట్టి పోయిన 1800 కోట్ల రూపాయలను వైసీపీ ప్రభుత్వమే చెల్లించిన వాస్తవాన్ని ఈ సందర్భంగా లేళ్ళ అప్పిరెడ్డి గుర్తు చేశారు. అదే విధంగా 2023-24లో ఎన్నికల కోడ్ కారణంగా ఏర్పడిన బకాయిలు చెల్లించాల్సిన బాధ్యత నుంచి ప్రస్తుత కూటమి ప్రభుత్వం పక్కకు తప్పుకోవడం సమంజసం కాదని ఆయన హితవు పలికారు. ఆ బకాయిలతో కలిపి, ఇప్పటి వరకు 3900 కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఆయన వివరించారు. లక్షల మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంలో ఇంకా జాప్యం చేయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఫిబ్రవరి 5వ తేదీన జరుగనున్న ఫీజు పోరును విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ పాలనలో 18,000 కోట్ల రూపాయలతో ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి పథకాలు విజయవంతంగా అమలైన నిజం అందరికీ తెలిసిందేనని ఆయన వ్యాఖ్యానించారు. ఏ ఏడాదికి సంబంధించిన ఫీజు రియింబర్స్ మెంట్‌ను అదే ఏడాదిలో నేరుగా తల్లుల ఖాతాల్లోకి నగదును జమ చేసినట్లు ఆయన చెప్పారు. ప్రతి త్రైమాసికంలో నేరుగా తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేసిన ఘనత వైయస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మండపాటి శేషగిరిరావు, బాలిరెడ్డి, సురసాని వెంకటరెడ్డి, మేకా రవి, వైయస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బడే జగదీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గురిశెట్టి రవి, గంటి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మస్తాన్, కరీం, రాజేష్, అజయ్, జిల్లా సంయుక్త కార్యదర్శులు సాజిద్, కిరణ్, అరుణ్, వర్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

# నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దాం

**- ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు**



**గుంటూరు, మేజర్ న్యూస్:** నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దాం ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు పిలుపు ఎస్ఎఫ్ఐ 49వ జిల్లా మహాసభలు గుంటూరు జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని నూతన జాతీయ విద్యా విధానం ప్రవేశ పెట్టడం వల్ల జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు పడిపోయాయని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్యా పూర్తిగా ప్రైవేటు పరం అవుతుందని తెలిపారు. దేశంలో విద్యార్థులకు ఉచిత విద్య అందించాల్సిన ప్రభుత్వం తమ బాధ్యత నుంచి తప్పించుకుంటుందని కేంద్ర ప్రభుత్వం రిలయన్స్ అంబానీ ఆదా అని లాకు విద్యను కట్టపట్టేందుకు ప్రయత్నం చేస్తుందని అన్నారు. అందరికీ సమానమైనటువంటి విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం మేధా ఉందని తెలిపారు. ప్రభుత్వ యూనివర్సిటీలకు వీసి నియమాంకాలను కేంద్ర ప్రభుత్వం గుప్పెట్లోకి తీసుకుంటుందని యూజీసీకి సంబంధం లేకుండా గవర్నర్లే వి సి లాను నియమించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గవర్నమెంట్ విద్యను కాపాడుకోవాల్సి న బాధ్యత మన మీద ఉందని తెలిపారు గుంటూరు నగరంలో ఒక్క ప్రభుత్వ డిగ్రీ కో ఎద్యుకేషన్ కళాశాల లేకపోవడం ప్రభుత్వాల యొక్క చేతకానితనమని విమర్శించారు ప్రభుత్వాలు పేద విద్యార్థులకు చదువుల దూరం చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయని అందులో భాగంగా ప్రభుత్వం విద్యాసంస్థల నిర్మించకపోవడం నిదర్శనం అని తెలిపారు. అధిక మొత్తంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో సైతం ఫీజులు పెంచుతున్నారని ఫీజు నియంత్రణ చేయాలని డిమాండ్ చేశారు. ఇతర దేశాలలో విద్యకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నారని పూర్తి బాధ్యత ప్రభుత్వమే వొస్తుందని కానీ మన దేశంలో మాత్రం విద్యను వ్యాపారపాలం చేస్తున్నారని విద్యా వ్యాపారీ కరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున భవిష్యత్తులో పోరాటం చేసేందుకు సిద్ధం కావాలని మహాసభ ద్వారా పిలుపునిచ్చారు. విద్యార్థుల ప్రభుత్వం ఇప్పటి వరకు తల్లి కి వందనం పథకం ప్రవేశపెట్టకపోవడం సిగ్గుచేటు అన్నారు పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.జీవో నెంబర్ 77 వెంటనే రద్దు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్కే సమీర్, జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ ,జిల్లా ఉపాధ్యక్షురాలు కే నవిత, సహాయ కార్యదర్శి ఏ యశ్వంత్,పవన్,సుభాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

# 1000 పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

▸▸ డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష ▸▸ ఏఈఆర్ఓ, జీఎంసి అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల కోసం గుంటూరు తూర్పు (94), పశ్చిమ నియోజక వర్గం(95)ల్లో 1000 మంది దాటిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల హేతు బద్ధీకరణ చేస్తూ ప్రకటించిన డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటా మని పశ్చిమ నియోజకవర్గం ఏఈఆర్ఓ, జిఎంసి అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ చాంబర్ లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా



అదనపు కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 1000 మందికి మించిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను, అదే ప్రాంతంలో మరొక కేంద్రం ఏర్పాటుకు డ్రాఫ్ట్ తయారు చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను తమ దృష్టికి తీసుకురావడానికి సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ఆయా పార్టీల ప్రతినిధులు డ్రాఫ్ట్ పై ఏ విధమైన అభ్యంతరాలు తెలపలేదని పేర్కొన్నారు. సమావేశంలో ఏఈఆర్ఓలు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సూరజ్ కుమార్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మనాభరావు, డిప్యూటీ తహసిల్దార్ నాగ మల్లేశ్వరరావు, నాయుడు ఓంకార్ (టిడిపి), పాండురంగ విఠల్ (బిజెపి), సిహెచ్.వాసు (బిఎస్పీ), బి.సునీల్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) కె.నళినికాంత్(సిపిఐ(ఎం), టి.సేవా కుమార్ (ఆమ్ ఆద్మీ పార్టీ), సిహెచ్.రామ వెంకట త్రినాద్(జనసేన) పాల్గొన్నారు.

# మద్యం దుకాణంలో చోరీ



మంగళగిరి, మేజర్ న్యూస్: మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి కాజలోని ఓ మద్యం దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణం వెనుకవైపు నుండి పైకి ఎక్కి రేకులు, సీలింగ్ కట్ చేసి నిందితుడు మద్యం దుకాణం లోపలికి ప్రవేశించాడు. క్యాష్ కౌంటర్ లో ఉన్న సుమారు రెండు లక్షల నగదును దొంగిలించుకుని పారిపోయాడు. శుక్రవారం ఉదయం మద్యం దుకాణాన్ని తెరిచిన సిబ్బంది చోరీ జరిగినట్లు గుర్తించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ విచారణ చేపట్టారు. మంగళగిరి రూరల్ సీఐ వై శ్రీనివాసరావు ఎస్ఐ వెంకట్ తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ టీవీ పుటేజిని పరిశీలించి ఆధారాలు సేకరించారు.



# పాలకులకు అధికారులకు కనిపించడం లేదా

# అభివృద్ధికి ఆమడ దూరంలో యానాది కాలనీ

**పెదకాకాని, మేజర్ న్యూస్:-**

**ఎన్ డి పి సూర్య ప్రత్యేక కథనం**

మండల పరిధిలోని నంబూరు గ్రామ శివారులో ఉన్న యానాది కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గతంలో వారందరూ మండల పరిధిలోని ఆయా కాలువ కట్టల పైన, రోడ్డు ప్రక్కన, పొలాలలో గుడిసెలు వేసుకుని జీవనం సాగించేవారు. 12 సంవత్సరాల క్రితం వారందరూ ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి సెంటు భూమి లేదు. ఈ ప్రాంతం వాసులు ఒక ఎలుకకు రూ.5చొప్పున వరి పంట పొలాల్లో ఉన్న ఎలుకలను బుట్టల ద్వారా పట్టి వాటి ద్వారా వచ్చే చాలీ చాలని ఆదాయంతో జీవనం కొనసాగిస్తున్నారు. పిల్లలు చదువుకునేందుకు అందుబాటులో ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో పిల్లలు బాల కార్మికులుగా మారారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ నిర్మాణ పథకం కాలనీ వాసులకు వర్తించకపోవడంతో పూరి గుడిసెల్లో నివసిస్తున్నారు. రోడ్లు,డ్రైనేజీలు లేక రోడ్లపై మురుగు మీరు చేరి రోగాల బారిన కొడుతున్నారు. ఆరోగ్య సిబ్బంది ఈ కాలనీలో సందర్శించిన దాఖలాలు లేవు. ప్రతిరోజు చిత్తు కాయితాలు, ఎలుకలను పట్టి వారి పిల్లలను పోషించుకుంటూ దుర్భర జీవనాన్ని అనుభవిస్తున్న ప్రభుత్వ అధికారులకు పట్టకపోవడం శోచనీయం. త్రాగునీరు అందుబాటులో లేకపోవడం వలన ఇతర ప్రదేశాల నుండి మీరు తెచ్చుకొని పరిస్థితి. ఇలాంటి కాలనీలో చదువు లేక బాల కార్మికులుగా మిగిలిన బాలలు కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తున్న అధికారులు గుర్తించలేకపోవడం విచారకం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అభివృద్ధికి నోచుకోని యానాది కాలనీని గుర్తించి సదుపాయాలు సమకూర్చవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలవ్వుతున్నా పేదవాడు పేదవాడుగానే మిగిలిపోతున్నాడు. ధనవంతులు ఇంకా ధనవంతులు అవుతున్నారు. పేదల కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నా నిజమైన పేదవారికి ఆ ఫలాలు అందని ద్రాక్షగా తయారైంది. బలహీన వర్గాల వాడలను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు అవుతున్నాయే తప్ప ఆచరణ శూన్యముగానే ఉంది. వృద్ధులకు పింఛన్ లేక, పిల్లలు చదువుకునేందుకు పాఠశాలలు అందుబాటులో లేక ఎస్టీ కాలనీల్లో నివాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని ఎన్నో పేద కుటుంబాలు రోడ్డుపై చిత్తు కాగితాలు ఏరుకొని, ఎలుకలకు పట్టుకొని జీవనం కొనసాగిస్తున్నారు. పిల్లలను సైతం పనులకు అంకితం చేస్తున్నారు. కూలీలకు పని కల్పించేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉంది. కానీ ఈ యానాది కాలనీ కూలీలను అధికారులు గుర్తించడం లేదు.**



**మా గుడిసెల దగ్గరికి మాయ మాటలు చెప్పి ఓట్లు వేయమని చెప్పి, ఓట్లు వేయించుకొని గెలిచిన తర్వాత మా గుడిసెలు వైపు కన్నెత్తినా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.**

ప్రమీలమ్మ



**గంగమ్మ**



మేము ఇప్పటికి 12 సంవత్సరాల నుంచి ఈ గుడిసెల్లో ఉన్న మాకు సెంటు భూమి కూడా ఇవ్వలేదయ్యా

**లక్ష్మయ్య**



నాకు ఇంతవరకు పించనే రాలేదు. ఇంకా కొంతమందికి రావాలి. మా పిల్లలు బడికి పోవాలంటే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నంబూరు ఆటోలో వెళ్లి సాయంత్రం ఆటోలో తిరిగి వస్తుంటారు. ఆటో వాళ్లకి మేము డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది.

## ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను వినియోగించాలి :ఎస్ ఐ ఎస్ .వెంకట రవి

**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :**

తెనాలి విజయవాడ ప్రధాన రహదా.రిలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రతి ఒక్కరు హెల్మెట్ వినియోగించాలని. ఎస్సై వెంకట రవి అన్నారు. దుగ్గిరాల గ్రామంలోని ప్రధాని రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనదారులపై కేసులు నమోదు చేసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు లైసెన్స్ ,హెల్మెట్ ను కలిగి ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు .దుగ్గిరాల పాతలాకులు.

కొత్త లాకులు , మంచికలపూడి, మోరంపూడితో పాటు, పలు చోట్ల వాహనాలను ఆపి లైసెన్స్ ,హెల్మెట్ ను పరిశీలించి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్ రవి తెలిపారు.



## ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

పెదకాకాని, మేజర్ న్యూస్:-

శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అందత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శివరంను ఆదివారం మండల పరిధిలోని వెనిగండ్ల శ్రీ వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగునని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు, ఆరోగ్య కార్డు, ఓటర్ కార్డ్ జిరాక్సులను, కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్లను తీసుకురాగలరని తెలిపారు.



# ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండాలి







- విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య
- అట్టహాసంగా ప్రారంభమైన "విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కే25"
- చిన్నారులకు రాష్ట్రస్థాయిలో ఆటల పోటీలు
- 5 వేల మందికి పైగా హాజరైన విద్యార్థులు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

విద్యార్థులు ఎల్లప్పుడు ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన విద్యార్థులు ముందుగా "విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కే25"లో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ చిన్నారులు మొబైల్ ఫోన్‌ను సాధ్యమైనంత తక్కువగా వినియోగించాలన్నారు. అదే విధంగా జంక్ ఫుడ్ తినకుండా సంప్రదాయ వంటలను మాత్రమే తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రతి రోజు గ్రౌండ్‌లో ఆటలు ఆడుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ చదువులో బాగా ఫోకస్ చేయాలన్నారు. విద్యార్థులు ఫిజికల్‌గా ఫిట్‌గా ఉన్నట్లైతే మెంటల్‌గా స్ట్రాంగ్‌గా ఉంటారని తెలిపారు. ఇలాంటి బాల మహోత్సవాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఒకరితో మరొకరు ఎలా మెలగాలి? బృంద సమూహంగా ఎలా పనిచేయాలనే విషయాలు తెలుస్తాయన్నారు. ఎవరైతే ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారో వారే అందరికంటే ముందుగా జీవితంలో స్థిరపడుతారని పేర్కొన్నారు.

**కృషి చేసిన వారే ఉన్నత స్థానాలకు : వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్**

జీవితంలో కష్టపడి పనిచేయడంతో పాటు బాగా కృషి చేసిన వారే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ అన్నారు. మీ కలల సాకారానికి అంకితభావంతో కృషి చేస్తే ఉన్నతంగా ఎదిగే శక్తి సామర్థ్యాలు మీలో ఉన్నాయని అన్నారు. క్రీడలు శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడుతాయని అన్నారు. శారీరక, మానసిక ధృఢత్వంతో పాటు స్నేహ సంబంధాలు మెరుగుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మకత అంశాలపై ప్రావీణ్యం సాధించినప్పుడే సంపూర్ణ విద్యార్థులు అవుతారని పేర్కొన్నారు.

**50కు పైగా ఈవెంట్ల నిర్వహణ**

విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా తొలిసారిగా నిర్వహిస్తున్న బాల మహోత్సవ్‌లో జూనియర్స్ ( 5 నుంచి 7 వ తరగతి), సీనియర్స్ (8 నుంచి 10వ తరగతి ) విద్యార్థులకు మొత్తం 50కు పైగా ఈవెంట్లను నిర్వహించారు. ముందుగా స్పోర్ట్స్ ఫీట్‌లో బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 4" 100 మీటర్ల రిలే నిర్వహిస్తామన్నారు. చిన్నారి బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో%-%ఖో, 100 మీటర్లు, 800 మీటర్లు, 4" 100 మీటర్ల రిలే పోటీలు నిర్వహించారు. వీటితో పాటు మ్యూజిక్ ( క్లాసికల్ సింగింగ్ సోలో, సింగింగ్ ఐడల్-లిటిల్ చాంప్, గ్రూప్ సింగింగ్, ఇన్స్ట్రుమెంట్ సోలో), డాన్స్ ( క్లాసికల్, వెస్ట్రన్, ఫోక్ (గ్రూప్), లిటరరీ ( ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్, జనరల్ క్విజ్, ఎలక్యూషన్), ఫైన్ ఆర్ట్స్ (స్పాట్ పేయింటింగ్, క్లే మోడల్లింగ్) పోటీలు నిర్వహించారు.

**పోటాపోటీగా క్రీడలు**

రాష్ట్ర స్థాయి విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లు పోటీపడుతున్నారు. అథ్లెటిక్స్‌లో భాగంగా 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందేలాను నిర్వహించారు. వీటితో పాటు వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలను నిర్వహించారు. విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీలన్నీ కూడా సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. నేడు ఫైనల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.







## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో
సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది,
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో
"నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని
నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో
ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవదలిచాము. కావలెను.
ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి
ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం,
5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను,
8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్,
11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి,
13. బొల్లాపలి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు : జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.



## నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

పి. బాలు (చిన కొండయ్య) బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
జి.శ్రీనివాసరావు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987
ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
జి.హిరన్మాయి(కన్నల్) నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్

శేషగిరి రాజు మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201
వై.ఏసుబాబు గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872
బి.పూర్ణచంద్రరావు సత్తెనపల్లి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9866246951
చెవుల రంగారావు మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635
యం.కృష్ణ మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149
వి.రవికుమార్ తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200
డి. చైతన్య వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453
వి.లూథర్ నరసరావుపేట రిపోర్టర్ సెల్ : 7799382078
జి.ఏలియా ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959
బి.సాంబశివరావు రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676
రమేష్ దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780
ఎస్.వెంకటేశ్వర్లు పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840
కె.నాగరాజు రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000
డి.రమేష్ ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898
పి.లక్ష్మీనారాయణ నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953
ఎస్.కె. రవూఫ్ శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737
అక్కిరెడ్డి నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987
బి.గురవయ్య వినుకొండ క్రైం రిపోర్టర్ సెల్ : 9908340426
వి.లక్ష్మీనారాయణ రెంటచింతల రిపోర్టర్ సెల్ : 8500079075
పి.వెంకటేశ్వర్లు దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858
టి.శ్రీకాంత్ వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723
పి.మణికంఠ మాచర్లటౌన్ రిపోర్టర్ సెల్ : 7013169885
ఎస్.డి.మహబూబ్ మాచర్ల క్రైం రిపోర్టర్ సెల్ : 9989124898
ఎం.కోటేశ్వరరావు మాచవరం రిపోర్టర్ సెల్ : 6303775169
డి.మల్లికార్జునరావు యడ్లపాడు రిపోర్టర్ సెల్ : 8309237441
రమేష్ క్రోసూరు రిపోర్టర్ సెల్ : 9493148828
ఎస్.విజయభాస్కర్ గుంటూరు రిపోర్టర్ సెల్ : 9440822538
షేక్ నాగూర్ నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300
పి.ఆనంద్ వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239
నాగరాజు మంగళగిరి టౌన్ రిపోర్టర్ సెల్ : 9032258913
రమేష్ నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600
"నేటి దినపత్రిక సూర్య" ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.